క్లుప్తంగా

కలుషిత నీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి



తాగునీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్

అంబర్‌పేట: కలుషిత తాగునీటి సరఫరాపై జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సూచించారు. డివిజన్‌లోని హైమద్‌నగర్‌లో తాగునీటి సమస్యపై స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కార్పొరేటర్ పర్యటించారు. తక్షణమే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీరు, డ్రైనేజీ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక సమస్యలను పరిష్కరించడంలో అలసత్వాన్ని సహించబోనని స్పష్టం చేశారు.

వీధి దీపాల మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: నింబోలిఅడ్డలోని కొన్ని ప్రాంతాల్లో అవసరమైన చోట రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కాచిగూడ డివిజన్‌కు నూతనంగా మంజూరైన సిమెంట్ పోల్స్, వీధి దీపాలకు శుక్రవారం ఆమె మరమ్మతులు చేయించారు. బీజేపీ నేతలు రమేష్ యాదవ్, బాబుల్, పంకజ్, దినేష్, బి.భీమ్ రాజ్, సూరి, రవియాదవ్, ఓంప్రకాష్, సంతోష్, రామకృష్ణ తదితరులున్నారు.

కరాటే శిక్షణతో మనోధైర్యం



విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేస్తున్న చీఫ్ ఎగ్జామినర్ సుదర్శన్

కాచిగూడ: కరాటే శిక్షణ ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతో మనోధైర్యాన్ని పొందుతారని జపాన్ కరాటే అసోసియేషన్ చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ అన్నారు. శుక్రవారం కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో జిల్లా స్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తమ బెల్ట్‌లను అప్‌గ్రేడ్ చేసుకున్నారు. అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు కరాటే బెల్ట్‌లను ప్రదానం చేశారు. హెల్త్ లీగ్ ప్రధాన కార్యదర్శి శాంతిస్వరూప్ లీలే, కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు సురేంద్ర కట్టేరి, రాఘవేంద్రదేశాయ్, కరాటే కోచ్ దామోదర్‌నాయక్, కరాటే ఇన్‌స్ట్రక్టర్ కృష్ణ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'విలేజ్ బస్సు ఆఫీసర్'తో సంబంధాలు మెరుగు

కాచిగూడ: ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్ కార్యక్రమంతో ప్రతి గ్రామంలో ఆర్టీసీ బస్సుల ద్వారా సిబ్బందికి మంచి విలువలు, సంబంధాలు మెరుగుపడతాయని ఖైరతాబాద్ ఆర్‌టీఓఎల్.రాంచందర్ అన్నారు. ఆర్టీసీఎండీ, వీసీ సజ్జనార్ ఇటీవల ప్రారంభించిన 'విలేజ్ బస్సు ఆఫీసర్' కార్యక్రమాన్ని శుక్రవారం కాచిగూడ బస్‌స్టాండ్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. డిపో పరిధిలో సుమారు 10 కాలనీలకు 10 మంది సిబ్బందిని కాలనీ ఆఫీసర్‌లుగా నియమించారు. ఆర్టీసీ డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



రమాదేవి (ఫైల్)

చిక్కడపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్, ఎస్సై నాగరాజులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యనగర్ బాగ్‌లింగంపల్లికి చెందిన మదిశెట్టి వెంకటేశ్వర్లు కుమార్తె మదిశెట్టి రమాదేవి (25), కి మతిస్థిమితం సరిగ్గా లేదు. గతనెల 25న మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో కూల్ డ్రింక్ కొనుక్కొని వస్తానని తన తల్లి మంగలక్ష్మి చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇలాగే 2021లో రెండుసార్లు ఇంట్లోంచి వెళ్లిపోగా.. పోలీసులు తిరిగి ఇంట్లో అప్పగించారు. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో చిక్కడపల్లి పోలీసులుకు ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 100 సీట్లు'

రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి మహమూద్ అలీ

ముషీరాబాద్: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ వంద సీట్లలో విజయం సాధించి మరోసారి సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టడం ఖాయమని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని కషిష్ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ హిమాయత్‌నగర్ తహసీల్దార్ పరిధిలో అర్హులైన వారికి మంజూరైన ఫించన్ కార్డులు, షాదీముబారక్ కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి లబ్ధిదారులకు ఫించన్ కార్డులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత 9 ఏళ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. మరో 50 ఏళ్లు తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వమే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీలు ఏమాత్రం అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. ఈ రెండు పార్టీల నాయకులు మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ.. అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. దేశంలో బీఆర్ఎస్‌కు ప్రజాదరణ రోజు రోజుకు పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. కులాంతర వివాహం చేసుకున్న మూడు జంటలకు సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో రూ.2,10,000ల చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెంటారెడ్డి, షరీఫ్, జీహెచ్ఎంసీ డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ముషీరాబాద్ తహసీల్దార్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

అంబర్‌పేట: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అంబర్‌పేటలో నిర్వహించిన సంక్షేమ సంబురాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రజా సంక్షేమం కోసం తెలంగాణలో అద్భుతమైన పథకాలు రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దాదాపు ప్రతి ఇంటికి చేరుతున్నాయని సీఎం కేసీఆర్ ప్రజా నాయకుడని, ఆయనను ప్రజలు రాబోయే ఎన్నికల్లో మరోమారు ఆశీర్వదించాలని కోరారు. గతానికి భిన్నంగా అంబర్‌పేట అభివృద్ధిలో ఎంతో మార్పు చెందిందని, దీనికి కారణం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కృషి అన్నారు. అనంతరం ఎంపిక చేసిన ఐదు మంది కుల వృత్తుల లబ్ధిదారులకు రూ.1 లక్ష చొప్పున మంజూరు పత్రాలు, పొదుపు సంఘాలకు మంజూరైన రూ.1.06 కోట్ల రుణ మంజురు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్ గౌడ్, అధికారులు వేణుగోపాల్, రజితా, సంధ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువ'



విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

కాచిగూడ: అమ్మాయిల ఆత్మవిశ్వాసం ఎంతో గొప్పదని వారు ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థినులు చదువుతో పాటు అభిరుచులకు అనుగుణంగా ఇతర రంగాల్లో కూడా ప్రావీణ్యం సంపాదించుకోవాలని ఆయన సూచించారు. నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 12వ స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువతులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని అమ్మాయిల్లో ఏది అనుకుంటే అది సాధించే గుణం ఉంటుందన్నారు. ధైర్య సాహసాలతో పాటు ఆత్మవిశ్వాసం మెండుగా ఉందని అందువల్లే వారు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారన్నారు. 2018–19, 2019–20 బ్యాచ్‌లకు చెందిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీబీఏ, ఎంబీఏ, ఎంఎస్సీలో ఉత్తీర్ణులైన 938 మంది విద్యార్థినులకు డిగ్రీ పట్టాలు, స్వర్ణ పతకాలను అందజేశారు. ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎం.రాములు, ఆర్‌బీవీఆర్ఆర్ మహిళా కళాశాల కార్యదర్శి ప్రొఫెసర్ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ వసుంధర, ప్రిన్సిపల్ డాక్టర్ జె. అచ్యుతాదేవి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.స్వప్న, డాక్టర్ కవిత, డాక్టర్ సుచిత్ర, బిందు, పావని తదితరులున్నారు.

'తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం'



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి



సీఎం కేసీఆర్‌కు పూలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కాచిగూడ: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య కన్నా అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కాచిగూడలోని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల సంబరాలను నిర్వహించారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, తదితర ఫించన్‌దారులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించి మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేయనున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎక్కాల కన్నా, మున్నాసింగ్, అశోక్‌రెడ్డి, అశోక్ కాక, శివరాజ్, సాగర్, గోపాల్ యాదవ్, కొండయ్య, జియా సంగప్ప, అంజమ్మ, సునీత, లక్ష్మి, ప్రియా, మంజూ, భూమమ్మ, జయశ్రీ తదితరులున్నారు.

అధికారుల పాత్ర ప్రశంసనీయం..

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో సంక్షేమ సంబరాలను నిర్వహించి రెవెన్యూ అధికారులను సత్కరించారు. మాజీ కార్పొరేటర్ పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, నగేష్‌గౌడ్ తదితరులున్నారు.

బాగ్‌అంబర్‌పేటలో..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తన వంతు కృషి చేస్తున్నట్లు బీఆర్ఎస్ బాగ్‌అంబర్‌పేట్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి తెలిపారు. డివిజన్‌లోని రామకృష్ణనగర్ కమ్యూనిటీహాల్ సంక్షేమ సంబురం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించి లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హుల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు.

'ఆరోగ్యలక్ష్మి' ని సక్రమంగా అమలు చేయాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ఆరోగ్యలక్ష్మి పథకం' సక్రమంగా అమలు చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి రిజిస్టార్ పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పావనీవినయ్‌కుమార్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్ల కంటే తక్కువ ఉన్న చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు రోజూ పోషకాహార ఆరోగ్యలక్ష్మి పథకం అమలుపై మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కేంద్రాలలో పాలు, బియ్యం, ఆహార పదార్థాలు, పప్పు, వండిన అన్నంతో పాటు పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణీలకు అందించేందుకు అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. బీజేపీ నగర నాయకుడు ఎ.వినయ్‌కుమార్, నాయకులు శ్రీకాంత్ ఎం.ఉమేష్, దోనేటి సత్యం, ఆనంద్ రావు, అంగ్‌వాడీ టీచర్ నర్సమ్మ, సిబ్బంది మాణిక్యమ్మ పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి



ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహిళల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని ఐద్వా జాతీయ నాయకురాలు టి.జ్యోతి పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. రోజు రోజుకు మహిళలపై జరుగుతున్న దాడులు, హింసకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటం చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఇటీవల దేశ కీర్తి ప్రతిష్టలను నిలబెట్టిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వేధింపులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర నాయకులు కె.ఎస్.ఆశలత, బి.హైమావతి, పి.శశికళ, నాగలక్ష్మి, వినోద, గీత, ఏ.పద్మ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్ఫూర్తి ప్రదాత దుర్గాబాయి దేశ్‌ముఖ్



సమావేశంలో పాల్గొన్న డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఉషారెడ్డి తదితరులు

నల్లకుంట: తన జీవితమంతా సమాజసేవకు, స్త్రీ జనోద్ధరణకు అంకితం చేసిన మహిళా స్ఫూర్తి ప్రదాత దుర్గాబాయి దేశ్‌ముఖ్ అని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ (డీడీఎంఎస్) అధ్యక్షురాలు ఎస్. ఉషారెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, కవయిత్రిగా.. ప్రతిభను కనబరిచి చరిత్రలో ఆమె నిలిచిపోయారని కొనియాడారు. శుక్రవారం నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రి, రీజెర్స్ సెంటర్ (డీడీహెచ్ఆర్‌సీ) ఆడిటోరియంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాలలో నిర్వహిస్తున్న అన్ని విభాగాల చైర్‌పర్సన్స్, కార్యదర్శుల కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉషారెడ్డి మాట్లాడుతూ.. దుర్గాబాయి ఆశయ సాధన కోసం డీడీఎంఎస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. డీడీఎంఎస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ జీఎలికే. దుర్గ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లలితాకామేశ్వరి, కోశాధికారి ఎస్వీరావు, ఈసీ సభ్యులు ఉషాకంద, లక్ష్మి, సుందరి, రాణి, పద్మావతి, చక్రపాణి, ప్రొఫెసర్ సుధాకర్ తదితరులున్నారు.

పనిగంటలు తగ్గించి వేతనాలు పెంచాలని వినతి



అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ తదితరులు

ముషీరాబాద్: మోడల్ స్కూల్స్ హాస్టల్ సిబ్బందికి గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని తక్షణమే వారి జీతాలను పెండింగ్ బకాయిలను చెల్లించాలని 8 గంటల పనిదినాన్ని అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రొగ్రెసివ్ మోడల్ స్కూల్ హాస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని, స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మోడల్ స్కూల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం నిర్ణయించాలన్నారు. కేజీబీవీలతో సమానంగా మోడల్ స్కూల్ సిబ్బందిని కూడా చూడాలని ఏఎన్ఎంలకు వారి అర్హతకనుగుణంగా వేతనం పెంచాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి వేతనాల పెంపును ఆలోచిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాధవి, ఎండీ.సుల్తానా, సునీత, విజయరాణి, ఆర్.భాగ్యమ్మ, రాణమ్మ తదితరులున్నారు.

'కుసుమ ధర్మన జీవనం ఆదర్శనీయం'



మాట్లాడుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి: ఓవైపు అట్టడుగు వర్గాల ప్రజల శ్రేయస్సుకు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. మరో పక్క సాహిత్య సృజనతో ప్రజలను జాగృతం చేసి 'కుసుమ ధర్మన జీవనం' ఆదర్శనీయమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శుక్రవారం త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై గానసభ ఆధ్వర్యంలో కుసుమ ధర్మన్న సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ.. రాజమండ్రిలో జన్మించిన ధర్మన్న అక్కడి కుల ఆధిపత్యాన్ని ఎదిరించి నిలిచి బడుగువర్గాలకోసం జయభేరి పత్రికను రంగూన్‌లోని విదేశీ తెలుగు వారి నుంచి నిధులు సేకరించి నడిపారని వివరించారు. ధర్మన్న ఉద్యమ ప్రభావం జస్టిస్ పార్టీ ఆవిర్భావానికి వి.లక్ష్మీనారాయణ పంతులు 'మాలపల్లి' రాసేందుకు దోహదం చేశాయన్నారు. గానసభ ఒక వర్గానికి కాకుండా సామాజిక చైతన్య దృష్టి మానవత్వాన్ని చూపే విజ్ఞతతో ధర్మన్న వంటి వారిని స్మరించుకోవాలన్నారు. బడుగు వర్గాల పెళ్లిళ్లకు ఉచితంగా హాల్ అందించడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. జర్నలిస్టు జయసూర్య, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కళా జనార్దనమూర్తి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.


పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కవాడిగూడ: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం వస్తున్న కారణంగా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన సూచించారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని రంగానగర్ లాల్‌బహదూర్ శాస్త్రి కమ్యూనిటీహాల్ వద్ద రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మహమ్మద్ గౌసొద్దీన్‌తహ, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, ఏఈ సుభాష్, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, బొంతల బస్తీ అధ్యక్షుడు నర్సింగ్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్‌లో ఇప్పటి వరకు రూ.1.60 కోట్ల నిధులతో తాగునీటి, డ్రైనేజీ పైపులైన్లు, రోడ్లు, కచ్చామోరీ నిర్మాణం, కమ్యూనిటీహాల్ ఏర్పాటుతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. అధికారులు డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ జానేద్ బాగ్దాది, రహీం, శ ంకర్‌గౌడ్, గుండా ఉమాకాంత్‌ముదిరాజ్, కృష్ణ, ఆర్.శ్రీనివాస్, మక్బుల్, జబ్బార్, కృష్ణ, ఎల్లేష్, సాయి, సురేందర్, సునీల్, ప్రవీణ్ తదితరులున్నారు.

'బీసీ కులగణన చేయకపోతే భారీ మూల్యం తప్పదు'

కాచిగూడ: దేశ జనగణనలో బీసీ కులగణన చేయకపోతే వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన ఫలితాలే రాష్ట్రంలో పునరావృతం అవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టడానికి అంగీకరించకుండా బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈ విషయంలో బీజేపీలో ఉన్న బీసీ నాయకులందరూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఆయన కోరారు. జనగణన పట్టికలో 34వ కాలమ్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించడం సరికాదన్నారు. బీసీలపై కేంద్రం తన విధానాన్ని మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. మండల్ కమిషన్ 40 సిఫార్సులు చేస్తే కేవలం రెండు సిఫార్సులు మాత్రమే అమలు చేశారని మిగతా 38 సిఫార్సులు ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా బీసీలంతా ఒకే వేదికపైకి వచ్చి బీసీల డిమాండ్ల సాధనకు కృషి చేయాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

'బీసీలపై రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ'



గౌరీశంకర్

ముషీరాబాద్: బీసీలపై రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తూ.. బీసీలను ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం వాడుకుంటుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌరీశంకర్ విమర్శించారు. శుక్రవారం అడిక్‌మెట్ డివిజన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది బీసీలు ఉంటారని వారందరికి ఒకొక్కరికి లక్ష చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 53 శాతం మంది బీసీలు ఉన్నప్పటికీ వారిని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రతి నియోజకవర్గంలో గెలుపు ఓటములను బీసీలే ప్రభావితం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పర్యాయాలుగా ఓబీసీలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. పేద బీసీ విద్యార్థులకు ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించాలని బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని కోరారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభాలను మార్చండి !



అంబర్‌పేట: గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ విద్యుత్ శాఖ ఏడీఈ శీనయ్యకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన కాలనీలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల వివరాలను అందించారు. ప్రమాదకరంగా ఉన్న వాటిని మార్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏడీఈని కోరారు. ప్రధాన కార్యదర్శి మధుసూదనాచారి పాల్గొన్నారు.

సంతాపం

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ జలమండలి మేనేజర్ రోహిత్ తండ్రి శివరాం మృతి పట్ల డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం రోహిత్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుసుకున్న కార్పొరేటర్ లాల్‌దర్వాజలోని వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.